
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5

సిద్దిపేట

బుధవారం 5 ఫిబ్రవరి 2025





సరస్వతీ శిశుమందిర్‌లో విద్యార్థుల సూర్యనమస్కారాలు



సిద్దిపేట కోమటిచెరువు రూబీ నెక్లెస్ వద్ద..



సంక్షేమ సిద్ధియోగ ఆధ్వర్యంలో సామూహిక సూర్యనమస్కారాలు

ఘనంగా రథసప్తమి

ఆకట్టుకున్న సామూహిక సూర్య నమస్కారాలు

సిద్దిపేట కల్చరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రథసప్తమి పురస్కరించుకుని మంగళవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో పలు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా చేపట్టిన సామూహిక సూర్య నమస్కారాలు ఆకట్టుకున్నాయి. పట్టణంలోని కోమటిచెరువు రూబీ నెక్లెస్ వద్ద వ్యాసమహర్షి యోగ సొసైటీ, సిద్దిపేట జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్, భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవంలో యువతీయువకులు, మహిళలు, విద్యార్థులు సూర్యనమస్కారాలు చేశారు. యోగా శిక్షకురాలు తోట సంధ్య ఆదిత్య శ్లోకంతో రథసప్తమి వేడుకలను ప్రారంభించి సూర్యనమస్కారాలను చేయించారు. అనంతరం పలువురు మాట్లాడారు.

9న శతసహస్ర సూర్యనమస్కారాలు

సిద్దిపేటలోని బాలికల ఉన్నత పాఠశాల మినీ స్టేడియంలో ఈనెల 9న నిర్వహించే శత సహస్ర సూర్య నమస్కారాల ప్రదర్శన, రాష్ట్రస్థాయి సూర్యనమస్కారాల పోటీలో యోగ సాధకులు, ఆరోగ్యాభిలాషులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. రిజిస్ట్రేషన్ ద్వారా పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే పట్టణంలోని సరస్వతీ శిశుమందిర్‌లో సంక్షేమ సిద్ధియోగ ఆధ్వర్యంలో రథసప్తమి వేడుకలు నిర్వహించారు. సంక్షేమ సిద్ధి యోగ ప్రతినిధి బొజ్జ అశోక్ ఆధ్వర్యంలో సామూహిక సూర్య నమస్కారాల కార్యక్రమం నిర్వహించారు. శ్రీ సరస్వతీ శిశుమందిర్‌లో సూర్యనమస్కార యజ్ఞం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 232 మంది విద్యార్థులు 15 మంది ఆచార్యులు పాల్గొన్నారు.



సిద్దిపేట కోమటిచెరువు రూబీ నెక్లెస్ వద్ద వ్యాస మహర్షి యోగసొసైటీ, యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్, భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సామూహిక సూర్య నమస్కారాలు

ఎంపీటీసీ స్థానాలు 230



అక్కన్నపేట మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో జాబితాను ప్రదర్శిస్తున్న అధికారులు

● జిల్లాలో పెరిగిన ఒక స్థానం ● తాజాగా ముసాయిదా ప్రకటించిన జడ్పీ సీఈవో ● మండల ప్రజాపరిషత్ కార్యాలయాల్లో ప్రదర్శన

సిద్దిపేట కలెక్టరేట్ ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎంపీటీసీ (మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ) స్థానాలకు సంబంధించి తాజాగా ముసాయిదా జాబితా విడుదలైంది. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు ప్రభుత్వం సమాయత్తం అవుతున్న తరుణంలో ప్రతీ మండలంలో కనీసం 5 ఎంపీటీసీ స్థానాలు ఉండాలనే నిబంధన పంచాయతీరాజ్ చట్టంలో ఉంది. ఈ మేరకు జిల్లాలో ఎంపీటీసీ స్థానాల పునర్విభజనను ప్రభుత్వ నిబంధనల మేరకు ఖరారు చేసి జడ్పీ సీఈవో రమేశ్ అధికారికంగా ప్రకటించారు. ఈ జాబితాను జిల్లా ప్రజాపరిషత్ మండల ప్రజాపరిషత్ కార్యాలయాల్లో ప్రదర్శించారు.

పెరిగిన ఎంపీటీసీ స్థానం

జిల్లాలో 2019 ఎన్నికల్లో 229 ఎంపీటీసీ స్థానాలున్నాయి. అయితే తొగుట మండలంలో ముంపు గ్రామాల్లో ఉన్న ఏటిగడ్డ కిష్టాపూర్, వేములగట్టు రెండు ఎంపీటీసీ స్థానాలను తొలగించారు. ఇదే క్రమంలో మూడు ఎంపీటీసీ స్థానాలు నూతనంగా ఏర్పడ్డాయి. దీంతో జిల్లాలో ఎంపీటీసీ స్థానాల సంఖ్య 230కి చేరింది. దుబ్బాక మండలం కమ్మర్‌పల్లి, మిరుదొడ్డి మండలంలో మోతే, అర్జున్‌పట్ల- కమలాయపల్లి ఎంపీటీసీ స్థానాలు ఏర్పడ్డాయి. పెరిగిన మండలాలను కలుపుకొని జడ్పీటీసీ స్థానాలు సైతం 26కు చేరాయి.

ఎటూ తేలని ఆ రెండు గ్రామాల పరిస్థితి

గతంలో జాలపల్లి, అర్జున్‌పట్ల, కమలాయపల్లి ఎంపీటీసీ స్థానంగా ఉండేది. ఈ మూడు గ్రామాలు మద్దూరు మండలంలోని ఉండేవి. అయితే దూళ్మిట మండలం ఏర్పడడంతో జాలపల్లి గ్రామం ఆ మండలంలో కలిసింది. అర్జున్‌పట్ల, కమలాయపల్లి గ్రామాలు 2020లో చేర్యాల మండలంలో కలిపారు. రెండు గ్రామాలు నాటి నుంచి రెవెన్యూకు సంబంధించిన పనులు చేర్యాల మండలంలోనే జరుగుతున్నాయి. కానీ మండల పరిషత్ సంబంధించిన పనులన్నీ మద్దూరు మండలంలోని కొనసాగుతున్నాయి. ఇప్పుడు అధికారుల నిర్లక్ష్యం వల్ల ఎంపీటీసీ స్థానాలు మళ్లీ మద్దూరు మండలంలోకి వచ్చాయి. ఇటీవల ఆ రెండు గ్రామాల ప్రజాప్రతినిధులు చేర్యాల మండలంలో కలపాలని జడ్పీ సీఈవోకు సైతం వినతి పత్రం సైతం అందజేశారు. తమ రెండు గ్రామాలను పూర్తిస్థాయిలో చేర్యాల మండలంలో కలపాలని లేదంటే వచ్చే ఎన్నికల్లో ఓటు వేయమని ప్రజలు చెబుతున్నారు.

మండలాల వారీగా ఎంపీటీసీ స్థానాల సంఖ్య

మండలం	2019	2025
సిద్దిపేటఅర్బన్	7	7
సిద్దిపేట రూరల్	13	8
నారాయణరావుపేట	0	5
అక్బర్‌పేట-భూంపల్లి	0	9
చిన్నకోడూర్	14	14
నంగునూర్	11	11
దుబ్బాక	13	10
మిరుదొడ్డి	11	7
తొగుట	10	8
దౌల్తాబాద్	9	9
గజ్వేల్	11	11
కొండపాక	14	10
జగదేవ్‌పూర్	11	10
మర్కుక్	7	7
ములుగు	10	10
వర్గల్	11	11
రాయపోల్	8	8
హుస్నాబాద్	6	6
అక్కన్నపేట	12	12
కోహెడ	13	13
బెజ్జంకి	10	10
మద్దూర్	11	7
చేర్యాల	11	11
కొమురవెల్లి	6	6
కుకునూర్‌పల్లి	0	5
దూళ్మిట్ట	0	5



సిద్దిపేటరూరల్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో జాబితాను ప్రదర్శిస్తున్న అధికారులు

మల్లన్నసాగర్ ముంపు గ్రామాలు

మునిసిపాలిటీలో విలీనం?

గజ్వేల్, ఫిబ్రవరి4 (ఆంధ్రజ్యోతి): మల్లన్నసాగర్ ముంపు గ్రామాలు మునిసిపాలిటీలో విలీనమైనట్లు తెలుస్తుంది. ఎన్నో రోజులుగా సందిగ్ధంలో ఉన్న గ్రామపంచాయతీల విలీనం ఇక లాంఛనమేనని అధికారులు చెబుతున్నారు. కొన్నాళ్లుగా ఈ విషయమై అనేక రకాల ప్రశ్నలు తలెత్తగా తాజాగా రెండో విడత పంచాయతీ రాజ్ ర్యాండమైజేషన్‌లో భాగంగా కుకునూరుపల్లి మండలంలోని తిప్పారం, అక్కన్నపేట మండలంలోని గుడాటిపల్లి, సిద్దిపేట రూరల్ మండలాలకు సంబంధించిన గ్రామాల్లో తుది ఓటరు జాబితాను ప్రదర్శించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ క్రమంలోనే గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న మల్లన్నసాగర్ ముంపు గ్రామాలైన ఏటిగడ్డ కిష్టాపూర్, వేములాఘాట్, రాంపూర్, లక్ష్మాపూర్, పల్లెపహడ్, ఎర్రవల్లి, బ్రాహ్మణ బంజేరుపల్లి, తిప్పారం మధిర గ్రామమైన సింగారం గ్రామాలకు సంబంధించి ఏ నిర్ణయం తెలియజేయకపోవడంతో మున్సిపాలిటీల్లో విలీనం లాంఛనమైనట్లే సమాచారం. వాస్తవానికి రెవెన్యూ పరిధి మునిసిపాలిటీలోనే ఉండడంతో గ్రామపంచాయతీలుగా కొనసాగించడం అసాధ్యమని, టెక్నికల్‌గా ఇది సాధ్యం కాదని తెలుస్తుంది.

పెండింగ్ జీపీల ముసాయిదా ఓటరు జాబితా విడుదల

● అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

సిద్దిపేట కలెక్టరేట్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పెండింగ్‌లో ఉన్న జిల్లాలోని గ్రామపంచాయతీల ఓటరు జాబితాను తయారు చేసి గ్రామపంచాయతీ, మండల పరిషత్ కార్యాలయాల్లో ఈనెల ప్రదర్శిస్తున్నట్లు అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ పేర్కొన్నారు.గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవితో కలిసి రాజకీయం పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా 2024 సెప్టెంబరు 28న రాష్ట్ర ఎన్నికల సంఘం రాష్ట్రవ్యాప్తం గా వార్డుల ఓటర్ జాబితాను విడుదల చేసిందన్నారు. ఆ సమయంలో కొన్ని కారణాల వల్ల రాష్ట్రవ్యాప్తంగా 64 గ్రామపంచాయతీ ఓటరు జాబితాను ప్రచురణ చేయలేదని చెప్పారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సిద్దిపేట రూరల్(15 జీపీలు), కొండపాక(1 జీపీ), అక్కన్నపేట (1 జీపీ) మండలాల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి, 17 పంచాయతీల ఓటర్ల జాబితాను అందించినట్లు తెలిపారు. 5 వరకు అభ్యంతరాలు స్వీకరించి జిల్లా పంచాయతీ కార్యాలయం ద్వారా 6న వాటిని పరిష్కరించి 7న తుది ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు తెలిపారు. ఏమైనా అభ్యంతరాలుంటే తెలియజేయాలని రాజకీయ పార్టీలకు సూచించారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

వాహనదారులకు 544 అవగాహన సదస్సులు

● సీపీ అనురాధ



సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు జనవరి 1 నుంచి 31 వరకు పోలీసులు నిర్వహించారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ పరిధిలో వివిధ ప్రాంతాల్లో వాహనదారులకు, ప్రజలకు ట్రాఫిక్, రోడ్డు నిబంధనలపై 544 అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమ నిర్వహణలో జిల్లా మూడోస్థానంలో నిలిచినట్లు సీపీ అనురాధ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాహనాలు నడిపే సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నియమాలపై వాహనదారులకు విద్యార్థులకు, ఆటో, లారీ డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాలో మూడు నేషనల్ హైవేలు, రాజీవ్ రహదారి, ఆర్అండ్‌బీ రోడ్లు ఉన్నాయని, ప్రమాదాల నివారణకు రోడ్డుపై ఉన్న 66 గ్రామాల్లో రోడ్ సేఫ్టీ కమిటీ 462 మంది మెంబర్లను నియమించడం జరిగిందన్నారు.

మూడో వారమూ తగ్గిన

ఆలయ బుకింగ్ ఆదాయం

● గతేడాది రూ.55.70 లక్షలు, ఈసారి రూ.43.28లక్షలు

● మూడువారాలుగా తగ్గుముఖం

● తాళాలు వేసినా వెనుకదారిగుండా వేలాదిమంది..!

చేర్యాల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతీవారం వేలాదిగా భక్తులు తరలివస్తున్నా గతేడాది కన్నా బుకింగ్ ఆదాయం తగ్గుతుండడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మూడు వారాలుగా ఆదాయం తగ్గుతుండటంతో ఆలయవర్గాలు తలపట్టుకుంటున్నారు. ఇటీవల ముగిసిన మూడోవారం జాతర సందర్భంగా తరలివచ్చిన భక్తులు సమర్పించిన మొక్కుబడులు, తలనీలాలు, ఆర్జితసేవలు, వసతి గదుల అద్దె, ప్రసాద విక్రయాలు, ప్రత్యేక దర్శనాలు, విరాళాలు, ఇతరత్రా రూపంలో శనివారం రూ.3,33,341, ఆదివారం రూ.32,71,796, సోమవారం రూ5,63,545, షాపుల అద్దె ప్రాథమిక చెల్లింపు రూ.1,60,060 ద్వారా రూ.43,28,742 ఆదాయం సమకూరింది. గతేడాది రూ.55.70 లక్షలు ఆదాయం సమకూరగా, ఈ సారి సుమారు రూ.13 లక్షల మేర తగ్గింది. మొదటి వారం రూ.9లక్షలు, రెండో వారం రూ.16.55లక్షలు, మూడోవారం రూ.13లక్షల చొప్పున జాతర మూడు వారాల్లో సుమారు రూ.40లక్షల ఆదాయం తగ్గడం పట్ల సందేహాలు తలెత్తుతున్నాయి.



క్యూలో బారులు తీరిన భక్తులు

ప్రజల్లో భద్రతాభావం పెంపొందించేందుకే

కార్డెన్ సెర్చ్

● సిద్దిపేట కేసీఆర్‌నగర్ కాలనీ డబుల్ బెడ్రూంలలో తనిఖీలు

● సరైన పత్రాలు లేని 54 బైకులు, ఐదు ఆటోలు సీజ్ : ఏసీపీ

8

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని

పెంపొందించుకోవాలి

● పలు మండలాల్లో మండలస్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్

8

మందులు సక్రమంగా

నిల్వచేయాలి

● జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ పల్వన్‌కుమార్

● సిద్దిపేటలోని సెంట్రల్ డ్రగ్ స్టోర్, జిల్లా స్టోర్ ఆకస్మిక తనిఖీ

7

పగలు వేడి.. రాత్రి చలి

● ఉమ్మడి మెదక్ జిల్లాలో రెండు వారాలుగా విభిన్న వాతావరణం ● ఫిబ్రవరి మొదటి వారంలోనే ముదిరిన ఎండలు



మెదక్ అర్బన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లాలో రెండు వారాలుగా విభిన్న వాతావరణ పరిస్థితులు కనిపిస్తున్నాయి. పగలు ఎండ మండుతుండగా.. రాత్రిళ్లు చలిపంజా విసురుతుంది. సాయంత్రం 5 గంటల వరకు కూడా ఎండ తీవ్రత కనిపిస్తుంది. రాత్రి 8 దాటక ముందే చలి తీవ్రత పెరుగుతోంది. ప్రస్తుతం చలికాలం పూర్తవక ముందే ఎండలు మొదలయ్యాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఫిబ్రవరి మొదటి వారంలోనే పగటి గరిష్ఠ ఉష్ణోగ్రత 36.8 డిగ్రీలకు చేరింది. ప్రస్తుతం తూర్పు, ఈశాన్య వాయువ్య గాలుల వల్ల రానున్న నాలుగు రోజుల పాటు పొగమంచు కురిసే అవకాశముందని వాతావరణశాఖ నిపుణులు పేర్కొన్నారు. గాలుల దిశల మార్పు వల్ల ఈ నెలలో ఒకవారం చల్లగా.. మరోవారం వేడిగా ఉండే అవకాశముందని వాతావరణ శాఖ కేంద్రం తెలిపింది. మార్చి నుంచి అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని పేర్కొంది. అయితే, సీజన్ మారుతున్న తరుణంలో ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతోంది. వారం రోజులుగా వాతావరణ మార్పులతో చలిగాలులతో చిన్నా, పెద్దా తేడాలేకుండా ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. జ్వరం, జలుబు, దగ్గుతో బాధపడుతున్నారు. దోమల బెడద కూడా అధికంగా ఉంది. రాత్రివేళల్లో చల్లగా, పగటి సమయంలో వేడిగా ఉండటం కూడా అనారోగ్యాలకు కారణమవుతోంది. ఈ సమయంలో చిన్నారులు, వృద్ధులు జాగ్రత్తలు పాటించాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

ఉష్ణోగ్రతలు ఇలా..

గడిచిన 24 గంటలో ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా గరిష్ఠంగా సంగారెడ్డి జిల్లా అల్మాయిపేటలో 36.8 డిగ్రీలు, సిద్దిపేట జిల్లా సముద్రాలలో 38.8 డిగ్రీలు, మెదక్ జిల్లా కాగజ్‌మద్దూర్ 36.7 డిగ్రీలు నమోదయ్యాయి.

సంగారెడ్డి అల్గోల్, కోహిర్ 11.9 డిగ్రీలు, అల్మాయిపేట 12.6, మెదక్ జిల్లా దామరంచ 13.5, వెల్దుర్తి 13.8 డిగ్రీలు, బేగంపేట 14.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

నవ వధువుకు వరకట్నం కాటు

- అత్తింటివారి వేదింపులు తాళలేక ఉరేసుకుని ఆత్మహత్య
- హత్యచేశారని వధువు తల్లిదండ్రుల ఆరోపణ
- కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న పోలీసులు


శ్రీజ(ఫైల్)

వికారాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఆశలతో అత్తింట్లో అడుగు పెట్టిన నవ వధువును వరకట్నం కాటేసింది. కంటికి రెప్పాలా చూసుకుంటాడు అనుకున్న భర్త, అత్తింటి వారు డబ్బు డిమాండ్ చేయడంతోపాటు చిత్రహింసలకు గురి చేయడంతో నవ వధువు బలవంతంగా తనువు చాలించింది. ఈ ఘటన వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. వికారాబాద్ పట్టణం సాకేత్‌నగర్ కాలనీకి చెందిన సాయికి నవంబర్ 7న సంగారెడ్డి జిల్లా మునిపల్లి గ్రామానికి చెందిన శ్రీజ(21)తో వివాహం జరిగింది. వివాహ సమయంలో తల్లిగారి ఇంటి వద్ద వివాహం జరిపించి కట్నం కింద రూ. 2 లక్షల నగదు, 12 తులాల బంగారం, ఒక బైక్‌ను ఇచ్చారు. నెల రోజుల పాటు సాఫీగా సాగిన వారి జీవితంలో వరకట్నం వేదింపులు మొదలయ్యాయి. అదనంగా మరో రూ.3 లక్షలు కావాలని భర్తతో పాటు అత్తింటి వారు డిమాండ్ చేయడంతో శ్రీజ ఈ విషయాన్ని తన తల్లికి తెలియజేసింది. దీంతో ఏం గొడవలు జరుగుతాయోనని అందోళన.. అత్తింట్లో బాధలు తప్పవని భావించిన శ్రీజ సోమవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయాన్ని సాయి తండ్రి అనంతయ్య ఫోన్ చేసి సమాచారం అందించారు. దీంతో శ్రీజ తల్లిదండ్రులు, బంధువులు వికారాబాద్‌కు చేరుకుని శ్రీజను మృతదేహాన్ని చూసి కన్నీరు మున్నీరయ్యారు. అత్తింటివారు తన కూతురును వరకట్నం కోసం హత్య చేశారని మండిపడ్డారు. హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని సాయి కుటుంబ సభ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు సంఘటనా స్థలం వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి శ్రీజ కుటుంబ సభ్యులకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. శ్రీజ తల్లి సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

ఆహారపు అలవాట్ల మార్పుతో కేన్సర్ దూరం

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఆహారపు అలవాట్ల మార్పు చేసుకోవడం ద్వారా కేన్సర్ రాకుండా కాపాడవచ్చని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్ సూచించారు. సంగారెడ్డిలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం వైద్య సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవీ, ప్రోగ్రాం ఆఫీసర్ డా.శశాంక్, డాక్టర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రపంచ కేన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సంగారెడ్డిలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.కే.అరుణాబాయి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జంతు శాస్త్ర విభాగం, హెల్త్‌క్లబ్, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, జీవశాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఎల్లమ్మ ఆలయంలో పూజలు

కొల్చారం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పోతంశెట్టిపల్లి ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం కాంగ్రెస్ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఆయనకు శాలువాతో సన్మానం చేశారు. అనంతరం రాంపూర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు నెల్లి రాజు, యేసు, ఆకుల మధు, కొటాల మధు రాజిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, పార్టీ మండలాధ్యక్షుడు మల్లేశంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం

హత్నూర, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): హత్నూర మండల పరిధిలోని దౌల్తాబాద్ భవాని స్ఫటిక లింగేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణం మంగళవారం వైభవంగా నిర్వహించారు. రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామీజీ హాజరై భక్తులకు ప్రవచనాలు బోధించారు. అనంతరం గ్రామంలో రథోత్సవం, శివపార్వతుల పల్లకీ ఉత్సవం అర్చకులు ప్రదీప్‌శర్మ, మాణిక్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కల్యాణంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పాల్గొని స్వామి వారికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు, బీజేపీ మెదక్ జిల్లా నూతన అధ్యక్షుడు మల్లేశంగౌడ్, మాజీ ఎంపీపీ నర్సింలు, తాజా మాజీ సర్పంచ్ వెంకటేశం, నాయకులు పాల్గొన్నారు.

టీచర్ల సమస్యల పరిష్కారమే ధ్యేయం

- బీజేపీ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి కొమరయ్య



మాట్లాడుతున్న బీజేపీ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి కొమరయ్య

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం శాసనమండలిలో ఉద్యోగ, ఉపాధ్యాయుల గొంతుక అవుతానని బీజేపీ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి కొమరయ్య అన్నారు. పట్టణంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ... ఉపాధ్యాయులు స్థానికత కోల్పోయేలా తెచ్చిన 317 జీవో సమస్య కేంద్ర ప్రభుత్వ దృష్టి తీసుకెళ్లి పరిష్కరానికి కృషి చేస్తానన్నారు. సమావేశంలో తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్‌సురేష్, రామారావు, దుబాషి భాస్కర్, దేశ్ భాస్కర్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎల్లం, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుందాం

- టీపీటీఎఫ్ అభ్యర్థి అశోక్‌కుమార్

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుందామని యూటీఎఫ్ బలపరిచిన టీపీటీఎఫ్ అభ్యర్థి అశోక్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం మెదక్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సంక్షేమం, విద్యారంగ పటిష్టతకు కృషి చేస్తానన్నారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి, టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు తిరుపతి రెడ్డి, టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి యాదగిరి, వెంకట్రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏడుపాయలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగొద్దు : ఎస్పీ


ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

పాపన్నపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఏడుపాయల ఆలయానికి వచ్చే భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. జాతర సమీపిస్తున్న నేపథ్యంలో మంగళవారం ఆలయం వద్ద ఏర్పాట్లను, పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. వాహనదారులకు ఇబ్బందులు లేకుండా పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలని ఆలయ అధికారులకు సూచించారు. ఇందులో ఆలయ ఈవో చంద్రశేఖర్, మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, సీఐ రాజశేఖర్ రెడ్డి, ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్, తదితరులున్నారు.

మద్యం తాగుతూ ఆటోడ్రైవర్ మృతి

ఐడీఏబొల్లారం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో ఓ ఆటో డ్రైవర్ మృతి చెందిన సంఘటన ఐడీఏబొల్లారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రవీందర్‌రెడ్డి వివరాల ప్రకారం.. కల్హేర్ మండలం మారిడి గ్రామానికి చెందిన రాజు(36) భార్య ఇద్దరు పిల్లలతో ఐడీఏబొల్లారంలో 15 ఏళ్లుగా నివాసముంటూ ఆటోడ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం మద్యం దుకాణంలో మద్యం సేవిస్తూ కుర్చీలోనే నిద్రలోకి జారుకుని మృతిచెందాడు. మృతుడి తమ్ముడు నవీన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయలు

- సీనియర్ న్యాయవాది మృతి


కిషన్‌రావు(ఫైల్)

నారాయణఖేడ్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన సీనియర్ న్యాయవాది మంగళవారం మృతిచెందారు. నాగల్‌గిద్ద మండలం ఏస్గీకి చెందిన కిషన్‌రావు న్యాయవాదిగా పనిచేస్తూనే, దివంగత మాజీ ఎమ్మెల్యే వెంకట్‌రెడ్డి అనుచరుడిగా టీడీపీలో చేరి, 1987లో జరిగిన మండల పరిషత్ ఎన్నికల్లో మనూరు ఎంపీపీకి పోటీచేసి కొద్ది ఓట్ల తేడాతో ఓడిపోయారు. అనంతరం ఆయన ఏస్గీ సర్పంచుగా, ఎంపీటీసీగా సేవలందించారు. సంగారెడ్డి, నారాయణఖేడ్ కోర్టుల్లో న్యాయవాదిగా సేవలందించారు. గత శుక్రవారం నారాయణఖేడ్‌లో భార్య కుమారుడితో కలిసి తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఎదుట నుంచి వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన కిషన్‌రావును చికిత్స నిమిత్తం యశోద ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్, సీనియర్ న్యాయవాది అనంత్‌రావుకులకర్ణి, తదితరులు వైద్యశాలకు వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మరమ్మతులకు నోచని మసీదు



మెదక్ కల్చరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : సుమారు 600 సంవత్సరాల క్రితం నిర్మించిన, గొప్ప సాంస్కృతిక, వారసత్వ చరిత్ర కలిగిన మెదక్ మండలంలోని కొంటూర్ మసీదు శిథిలావస్థకు చేరింది. నిర్వహణ సరిగా, మరమ్మతులకు నోచుకోక అక్కడక్కడ పెచ్చులూడి రంధ్రాలు ఏర్పడ్డాయి. దీంతో వానకాలంలో నీరంతా మసీదులోకి చేరి నమాజ్ చేసుకునే పరిస్థితి లేకుండా పోతుంది. గతంలో ఆర్కియాలజీ అధికారులు పలుమార్లు సందర్శించి మరమ్మతులు చేస్తామని హామీలిచ్చినా అమలుకాలేదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి మరమ్మతులతో వారసత్వ కట్టడాన్ని కాపాడలని గ్రామస్థులు కోరుతున్నారు.



చీరతో.. పంటలకు రక్ష

నారాయణఖేడ్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రబీ పంటలు చేతికి అందుతున్న దశలో అడవి పందుల బెడద తీవ్రం కావడంతో రైతులు పంటల రక్షణ కోసం పడరాని పాట్లు పడుతున్నారు. కొందరు రైతులు పొలాల్లో మెగాఫోన్లను వినియోగిస్తుంటే, మరికొందరు కాపలా ఉంటూ టపాసులు కాల్చుతున్నారు. ఇంకొందరు రైతులు వినూత్నంగా ఆలోచించి పంట పొలాల చుట్టూ పాత చీరలను కడుతున్నారు. గాలికి రెపరెపలాడుతున్న రంగురంగుల చీరలు, వాటి శబ్దానికి అడవి పందులు బెదిరిపోయి పంటల పొలాల్లోకి రాకుండా అటునుంచి అటే పారిపోతున్నాయని రైతులు చెబుతున్నారు. చీరలతో పొలాలకు కొత్త అందం వచ్చింది.

చెక్కతో.. చక్కని రూపాలు

మెదక్ కల్చరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : నేటి ఆధునిక యుగంలో ఏ వస్తువైనా యంత్రాలతోనే తయారవుతున్నది. కానీ కామారెడ్డి జిల్లా గోపాల్‌పేటకు చెందిన స్వామి మాత్రం తన చేతితోనే చెక్కలతో అందమైన కళా రూపాలను తయారు చేస్తూ ఔరా అనిపిస్తున్నాడు. కొండపల్లి బొమ్మలకు ఏమాత్రం తీసిపోని విధంగా చక్కగా తయారు చేసి అందరి దృష్టి ఆకర్షిస్తున్నాడు. స్వామి కొన్ని రోజులుగా మెదక్ పట్టణంలోని అతిథుల విశ్రాంత భవనానికి వెళ్లే మార్గం ప్రధాన రహదారి పక్కన చిన్న ఆవాసం ఏర్పాటు చేసుకొని ఆయన తయారు చేసిన బొమ్మలను అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు.



కార్పొరేట్ శక్తులకు మేలు చేసే బడ్జెట్

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్క రాములు



విజయ సూచిక చూపిస్తున్న సీపీఎం నాయకులు

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు మేలు చేసేలా ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్క రాములు విమర్శించారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేటు పెట్టుబడులు వస్తేనే అభివృద్ధి జరుగుతుందనే భ్రమలో ప్రభుత్వాలు ఉన్నాయని, అందుకే బడ్జెట్‌లో ప్రైవేటు రంగానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. విపరీతంగా పెరుగుతున్న నిత్యవసర ధరల కట్టడికి చర్యలు చేపట్టడం లేదన్నారు. కేంద్ర బడ్జెట్‌తో కార్మికులు, సామాన్య ప్రజానికానికి ఎలాంటి మేలు లేదని, ఇప్పటికైనా బడ్జెట్‌లో మార్పులు చేసి పేదలకు మేలు జరిగేలా రూపొందించాలన్నారు. పార్టీ ఫిరాయింపులు చట్ట వ్యతిరేకమని, బీఆర్ఎస్ నుంచి గెలుపొంది వారి స్వప్రయోజనాల కోసం పార్టీలు మారిన వారిపై స్పీకర్ చర్యలు తీసుకోవాలని హై కోర్టు కూడా చెప్పిందని గుర్తు చేశారు. కానీ, రాజ్యాంగం కల్పించిన పదవిలో ఉండి కూడా స్పీకర్ ప్రభుత్వం చెప్పుచేతల్లో పనిచేయడం దురదృష్టకరమన్నారు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా వ్యవహరించే ఎమ్మెల్యేలపై స్పీకర్ వెంటనే చర్యలు తీసుకోవాలని సీపీఎం తరఫున డిమాండ్ చేస్తున్నామని పేర్కొన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాణిక్యం, రాజయ్య, అడివయ్య, మల్లేశం, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

మందులను సక్రమంగా నిల్వచేయాలి

● సిద్దిపేట జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ పల్వన్‌కుమార్



సెంట్రల్ డ్రగ్‌స్టోర్ సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా వైద్యశాఖాధికారి పల్వన్‌కుమార్

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): మందుల నిల్వలను సక్రమైన పద్ధతిలో భద్రపరచాలని సిద్దిపేట జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ పల్వన్‌కుమార్ సిబ్బందికి సూచించారు. మంగళవారం సిద్దిపేట పట్టణంలోని సెంట్రల్ డ్రగ్ స్టోర్, జిల్లా స్టోర్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా జిల్లా స్టోర్‌ను సందర్శించి మందుల నాణ్యత, రికార్డులు, వాక్సిన్ శీతలికరణ స్థితిని పరిశీలించారు. మందుల గడువుపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం అక్కడినుండి సెంట్రల్ డ్రగ్ స్టోర్‌ను సందర్శించి సిబ్బందితో మాట్లాడుతూ కూల్ రూమ్‌లో ఉంచాల్సిన మందుల పైన ప్రత్యేక శ్రద్ధ వహించాలని, కచ్చితంగా నెలకు ఒకసారి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు మందులను పంపించాలని ఆదేశించారు. పీహెచ్‌సీల వైద్య అధికారులు వారికి కావలసిన ఇండెంట్‌ను ఈ ఔషధీ పోర్టల్ ద్వారా సెంట్రల్ డ్రగ్‌స్టోర్‌కు పంపించాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు నవీన్ రాజ్‌కుమార్, అనిల్‌కుమార్, ఫార్మసిస్టులు వెంకటేశ్వర్లు, మక్సూద్‌అలీ, ప్రశాంత్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.



అసంపూర్తిగా సమీకృత మార్కెట్ పనులు

పాలన ముగిసె.. పనులు పూర్తికాలే

ఐదేళ్లలో నర్సాపూర్ మున్సిపల్ అభివృద్ధి అంతంతే..

- సీసీరోడ్లు, మురుగు కాల్వల నిర్మాణానికే పరిమితం
- ప్రత్యేక నిధులున్నా సద్వినియోగం చేసుకోని వైనం
- అర్ధాంతరంగా నిలిచిపోయిన పలు ప్రగతి పనులు

నర్సాపూర్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ మున్సిపల్ ఏర్పడిన తర్వాత మొదటి పాలకవర్గం ఐదేళ్ల పదవీ కాలం ముగిసినా చెప్పుకోదగ్గ అభివృద్ధి చేయలేకపోయారు. సీసీరోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం తప్పా చెప్పుకోదగ్గ అభివృద్ధి పనులు పూర్తి చేయలేకపోయారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో నర్సాపూర్ మున్సిపాలిటీకి వచ్చిన రూ.45కోట్ల ప్రత్యేక నిధులనూ పూర్తిస్థాయిలో వినియోగించలేకపోయారు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆ నిధులు వెనక్కి వెళ్లడంతో పట్టణంలోని ప్రధాన అభివృద్ధి పనులన్నీ ఎక్కడికక్కడే నిలిచిపోయాయి.

సగంలోనే సమీకృత మార్కెట్..

నర్సాపూర్ పట్టణంలో రూ.2 కోట్లతో చేపట్టిన సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. గత ప్రభుత్వంలో ప్రారంభించిన పనులు ఏళ్లు దాటినా పూర్తిచేయలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక గత ప్రభుత్వం కేటాయించిన ప్రత్యేక నిధులు నిలిచిపోవడంతో పనులూ సగంలోనే ఆగిపోయాయి. దీంతో పట్టణంలో కూరగాయలతో పాటు మాంసం విక్రయదారులు రోడ్లపైనే వ్యాపారాలు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొన్నది.

పూర్తయినా ప్రారంభానికి నోచుకోక..

కోటి రూపాయలతో ఆధునిక శ్మశాన వాటిక పనులు పూర్తయినా అందుకు సంబంధించిన బిల్లులు రాకపోవడంతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల మధ్య సమన్వయం లేక ప్రారంభానికి నోచుకోలేదు. వినియోగంలో లేక అందులో ఏర్పాటు చేసిన సామగ్రి దొంగల పాలవుతున్నది. డంప్‌యార్డుది దాదాపు ఇదే పరిస్థితి. రూ.50లక్షలతో ఆధునిక హంగులతో డంప్‌యార్డు నిర్మించారు. ఇంకా చిన్నచిన్న పనులు మిగిలిపోవడంతో వినియోగంలోకి తేలేకపోయారు. దీంతో సేకరించిన చెత్తనే అక్కడే ఖాళీ స్థలంలో వేస్తుండటంతో ఆ ప్రాంతమంతా కంపుకొడుతున్నది.

అసలు మొదలుకానివి మరెన్నో..

పట్టణంలో అసంపూర్తి పనులేకాదు.. అసలు మొదలుకానివి మరెన్నో ఉన్నాయి. గత ప్రభుత్వం పార్కు ఏర్పాటుకు కోటి రూపాయలు, స్టేడియం నిర్మాణానికి రూ.2కోట్ల ప్రత్యేక నిధులు కేటాయించినా ఇప్పటికీ వాటి ఊసే లేదు. ఇక ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేక ఇటు ఉద్యోగులు, అటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యమైన తహసీల్దార్ కార్యాలయానికి కూడా సొంత భవనం లేక అతిథిగృహంలో అరకొర సౌకర్యాలతో సాగుతుంది. దీంతో పాటు ఆర్డీవో, కోర్టు, ఎక్సైజ్, సబ్‌రిజిస్ట్రార్, పీజీ కాలేజీ, మైనార్టీ గురుకులం, గిరిజన బాలికల గురుకులం తదితరవాటికీ సొంత భవనాలు కరవయ్యాయి. దీంతో నర్సాపూర్ పేరుకే డివిజన్, నియోజకవర్గ కేంద్రం తప్పా.. అనేక సమస్యలతో సతమతమవుతున్నది. ప్రస్తుతం ప్రత్యేక అధికారుల పాలన ఎలా సాగుతుందో చూడాలి.



చివరిదశలో ఆగిపోయిన మున్సిపల్ భవనం

తుది దశకు వచ్చినా..

నర్సాపూర్ మున్సిపల్ కార్యాలయానికి సొంత భవనం లేక ప్రస్తుతం వెప్కా గ్రూపుకు సంబంధించిన భవనంలో అరకొర సౌకర్యాలతో కొనసాగిస్తున్నారు. గత ప్రభుత్వంలో కొత్తగా మున్సిపల్ భవనం కోసం రూ.6 కోట్లు కేటాయించి ఆధునిక హంగులతో రెండతస్తుల భవనం నిర్మాణం చేపట్టగా, పనులు తుదిదశకు చేరుకున్నాయి. అనంతరం ప్రభుత్వం మారడం.. నిధులు రాకపోవడంతో అంతలోనే పనులు ఆగిపోయాయి. దీంతో మొదటి పాలకవర్గం హయాంలో కొత్త కార్యాలయంలోకి వస్తామని ఆశించినా వారి ఆశ నెరవేరకుండానే గడువు ముగిసిపోయింది.



డంప్‌యార్డును అందుబాటులోకి తేకపోవడంతో పక్కనే ఖాళీ ప్రదేశంలో చెత్త డంపింగ్

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో రైతు మృతి



రామ్‌లాల్ (ఫైల్)

శివ్వంపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన సంఘటన మంగళవారం రాములు తండాలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని నవాబ్‌పేట్ పంచాయతీ పరిధిలోని రాములుతండాకు చెందిన పాల్త్య రామ్‌లాల్ (54) సోమవారం మధ్యాహ్నం భార్య లక్ష్మితో కలిసి పొలానికి వెళ్లాడు. వరి పంటకు నీళ్లు పెట్టేందుకు బోరు మోటర్ ఆన్ చేస్తుండగా విద్యుత్ షాక్ తగలడంతో కిందపడిపోయాడు. వెంటనే భార్య లక్ష్మి, కొడుకు శ్రీకాంత్ రామ్‌లాల్‌ను సూరారంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మధుకర్ రెడ్డి తెలిపారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



బాబు(ఫైల్)

వర్గల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి బానిసైన యువకుడిని కటుంబ సభ్యులు మందలించడంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వర్గల్ మండల కేంద్రానికి చెందిన కొమ్ము బాబు(38) మద్యానికి బానిసై పనికి వెళ్లకుండా తెలిసిన వారి వద్ద అప్పులు చేస్తూ మద్యం తాగుతున్నాడు. ఈ విషయమై ఆదివారం సాయంత్రం భార్య భాగ్య బాబను మందలించడంతో మనస్తాపానికి గురై సోమవారం రాత్రి వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పొలంలోకి దూసుకెళ్లిన కారు



పొలంలోకి దూసుకెళ్లిన కారు

రాయపోల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఓ కారు అదుపుతప్పి రోడ్డు దిగి పొలంలోకి దూసుకెళ్లిన సంఘటన మంగళవారం సాయంత్రం రాయపోల్ మండలం కొత్తపల్లి వద్ద చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తపల్లికి చెందిన మహేష్ మంగళవారం సాయంత్రం వరి పొలంలో యూరియా, గుళికలు చల్లడానికి తన కారులో రాయపోల్ నుంచి కొత్తపల్లి వైపు వెళ్లాడు. ఈ క్రమంలో కొత్తపల్లి బస్టాండ్ వద్ద కారు అదుపుతప్పి తన పొలంలోకే దూసుకెళ్లి బోల్తా కొట్టింది. ఈ సమయంలో కారులో నలుగురు ప్రయాణిస్తుండగా ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు.

యువతి అదృశ్యం



నవ్య(ఫైల్)

రామచంద్రాపురం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : యువతి అదృశ్యమైన సంఘటన కొల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొల్లూరు డబుల్‌బెడ్‌రూం కాలనీలో నివాసం ఉండే హీరాకర్ నవ్య (21) ఇంటర్మీడియట్ పూర్తి చేసి ఇంటి వద్దే ఉంటోంది. సోమవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లిన నవ్య తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు నవ్య ఆచూకీ కోసం చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో మంగళవారం కొల్లూరు పోలీసు స్టేషన్‌లో యువతి తండ్రి శివాజీ ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించామని ఇన్‌స్పెక్టర్ రవీందర్ పేర్కొన్నారు.

మహిళతో అసభ్య ప్రవర్తన

● ఆమెతో సహా మరో ముగ్గురు కలిసి దాడి.. ఆస్పత్రిలో వ్యక్తి మృతి



దీపక్ ఠాగూర్ మృతదేహం

పటాన్‌చెరు రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళతో అసభ్యంగా ప్రవర్తించాడు. ఆగ్రహానికి గురైన ఆ మహిళ మరో ముగ్గురితో కలిసి అతడిపై దాడి చేసింది. తీవ్రంగా గాయపడిన అతను ఆస్పత్రిలో మృతి చెందాడు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలు బీడీఎల్ బానూరు సీఐ స్వామిగౌడ్ కథనం ప్రకారం.. నందిగామ గ్రామంలోని ఓ ప్రైవేట్ వెంచర్‌లో బిహార్‌కు చెందిన దీపక్ ఠాగూర్(30) సెంట్రింగ్ మేస్త్రీగా పని చేస్తున్నాడు. ఈ నెల 2న అక్కడే వంట మనిషిగా పని చేసే పశ్చిమ బంగాకు చెందిన ఓ మహిళతో మద్యం మత్తులో అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో ఆ మహిళతో పాటు అదే రాష్ట్రానికి చెందిన గోదాంగ సన్యాసి, సంజయ్ మెండల్, షోబేవ్ సర్కార్‌లు దీపక్ ఠాకూర్‌పై దాడి చేసి కొట్టారు. తీవ్రంగా గాయపడిన అతడిని అక్కడి వారు స్థానికంగా ఓ ఆర్ఎంపీ వద్దకు తరలించారు. అక్కడి నుంచి పటాన్‌చెరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా, సోమవారం దీపక్ చనిపోయాడు. లేబర్ కాంట్రాక్టర్ సయ్యద్ మహ్మద్ పాషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు నలుగురిపై హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు చైన్‌స్నాచర్ల అరెస్టు

హవేళిఘణపూర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : చైన్‌స్నాచింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరు యువకులను అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం మడల పరిధిలోని మెదక్ డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. బెట్టింగ్, జల్సాలకు అలవాటుపడిన మెదక్ పట్టణానికి చెందిన మహ్మద్ అబ్దుల్‌ఖాదిర్, మహ్మద్ అబ్దుల్ షఫీ వారి స్నేహితుడు మహ్మద్ హఫీజ్ వద్ద నుంచి బైక్ తీసుకుని చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్నారు. సోమవారం సాయంత్రం హవేళిఘణపూర్ పోలీసులు ఔరంగాబాద్ తండా శివారులో వాహనాలు తనిఖీ చేస్తుండగా బైక్‌పై అనుమానస్పదంగా వెళ్తున్న వీరిని ఆపే ప్రయత్నం చేయగా తప్పించుకొని పారిపోతుండగా వెంటపడి పట్టుకున్నారు. స్టేషన్‌కు తరలించి విచారణ చేయగా మండలంలోని ముత్తాయికోట, జక్కన్నపేట, భూర్గుపల్లి శివారుల్లో చైన్‌స్నాచింగ్‌కు పాల్పడినట్లు ఒప్పుకున్నారు. వారి నుంచి ఆరు తులాల బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్, యూనికాన్ బైక్, రెండు హెల్మెట్లను స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా కామారెడ్డి జిల్లా దోమకొండ మండలం సీతారాంపూర్, రాజంపేట, బిక్కనూరు మండలం జంగంపల్లి శివారులో ఆరుతులాల బంగారు ఆభరణాలు దొంగిలించినట్లు తెలిపారు. ఈ బంగారాన్ని హైదరాబాద్‌లో వాల్యూ గోల్డ్ షాపులో అమ్మగా వచ్చిన రూ.2,08,293లను ఇద్దరు పంచుకున్నారన్నారు. వాల్యూగోల్డ్ వారికి నోటీసు ఇచ్చామని, దాన్ని కూడా రికవరీ చేస్తామని తెలిపారు. కేసును ఛేదించిన పోలీసులను ఎస్పీ అభినందించారు. సమావేశంలో మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి, ఎస్సై సత్యనారాయణ పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

రాష్ట్రస్థాయిలో మెరిసిన ప్రభుత్వ డిగ్రీ విద్యార్థిని

మెదక్ అర్బన్, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): ఇంగ్లిష్ భాష, కమ్యూనికేషన్ నైపుణ్యాల మెరుగుదల అంశంలో మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి అశ్విత రాష్ట్రస్థాయిలో మెరిసింది. తెలంగాణలోని ఆదివాసీ విద్యార్థుల కోసం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆమె ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డా.హుస్సేన్ తెలిపారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు శిక్షణలో రాష్ట్ర నలుమూల నుంచి దాదాపు 60 మందికిపైగా పాల్గొనగా.. అశ్విత ఉత్తమంగా నిలిచింది.

జిన్నింగ్ మిల్‌లో అగ్ని ప్రమాదం

● సుమారు రూ. 1.5 కోట్ల నష్టం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

జోగిపేట, ఫిబ్రవరి4 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా జోగిపేట మండలంలోని ఓ జిన్నింగ్ మిల్‌లో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. పత్తి బేళ్లతో నిండి ఉన్న మిల్లులో ఒక్కసారిగా మంటలు అంటుకోవడంతో బేళ్లన్నీ కాలిపోయాయి. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఎర్రారం శివారులోని వైభవ్ మురుగన్ జిన్నింగ్ మిల్లులోని ఓ యంత్రంలో మంగళవారం మధ్యాహ్నం నిప్పురవ్వలు ఎగసిపడ్డాయి. అవి మంటలుగా మారి యంత్రాలకు వ్యాపించి.. ఆపై మిల్లులోని పత్తిబేళ్లకు అంటుకుని.. బైళ్లన్నీ కాలిపోయాయి. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పేశారు. ఈ ప్రమాదంలో సుమారు 1.5 కోట్ల నష్టం వాటిల్లిందని మిల్లు యజమానులు భాస్కర్ గుప్తా, శంకర్ గుప్తా తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రూ. 93,060 రికవరీ, రూ. 56వేల జరిమానా



సోషల్ ఆడిట్ ఇయరింగ్ నిర్వహిస్తున్న అధికారులు

తూప్రాన్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): తూప్రాన్ మండలంలో 2023-24 సంవత్సరంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిర్వహించిన పనులకు సోషల్ ఆడిట్ ఇయరింగ్ నిర్వహించారు. తూప్రాన్ మండలం రూ.6కోట్ల విలువైన పనులు ఉపాధి హామీ పథకంలో నిర్వహించగా, 15వ విడత సోషల్ ఆడిట్ చేపట్టారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా ప్రజాదర్బార్ నిర్వహించలేదు. సోషల్ ఆడిట్‌పై తూప్రాన్ ఎంపీపీ కార్యాలయంలో ఇయరింగ్ నిర్వహించారు. ఉపాధి హాథకంలో జరిగిన అవకతవకలు, నిర్లక్ష్యంపై రూ. 93,060 రికవరీ, రూ. 56వేల జరిమానా విధించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో అడిషనల్ పీడీ రంగాచార్యులు, జిల్లా విజిలెన్స్ వింగ్ శ్రీహరి, హెచ్‌ఆర్ మేనేజర్ రాజేందర్‌రెడ్డి, ఎంపీడీఓ శేషాద్రి, ఏపీఓ సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొండపాక, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్పడగ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏఈ సత్యం తెలిపారు. సబ్‌స్టేషన్‌లో ఎక్కువ సామర్థ్యం గల పవర్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ బిగింపు పనుల నిమిత్తం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. దీంతో సబ్ స్టేషన్ పరిధిలోని మర్పడగ, సిరిసినగండ్ల, ఖమ్మంపల్లి, జప్తి నాచారంలోని కొంత ప్రాంతంలో మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం వరకు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

మోటివేషన్ స్పీకర్‌గా భగవాన్‌రెడ్డి

కొండపాక, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కొండపాక మండలం బందారం గ్రామానికి చెందిన భగవాన్‌రెడ్డి ఇంపాక్ట్ ఫౌండేషన్ ద్వారా శిక్షణ పొంది మోటివేషన్ స్పీకర్ గా సర్టిఫికెట్ అందుకున్నారు. ఈ సందర్భంగా భగవాన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో, యువతలో మంచి విలువలతో కూడిన వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించేందుకు ఇంపాక్ట్ ఫౌండేషన్ కృషి చేస్తుందని పేర్కొన్నాడు.

ప్రజల్లో భద్రతాభావం పెంపొందించేందుకే కార్డెన్ సెర్చ్

● సిద్దిపేట కేసీఆర్‌నగర్ కాలనీ డబుల్ బెడ్రూంలలో తనిఖీలు ● ఎలాంటి ధ్రువపత్రాలు లేని 54 బైకులు, 5 ఆటోలు సీజ్: ఏసీపీ




కేసీఆర్‌నగర్‌లో కాలనీవాసులతో మాట్లాడుతున్న సిద్దిపేట ఏసీపీ మధు, సీజ్ చేసిన వాహనాలు

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేసీఆర్‌నగర్‌కాలనీలో డబుల్ బెడ్‌రూమ్‌లలో సిద్దిపేట ఏసీపీ మధు ఆధ్వర్యంలో మంగళవారం కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. కార్డెన్‌సెర్చ్‌లో ఎలాంటి ధ్రువపత్రాలు లేని 54 బైకులు, 5 ఆటోలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ప్రజలను నేరుగా కలిసి వారి సమస్యలను తెలుసుకోవడం, కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ప్రజల రక్షణకు సంబంధించి భద్రతాభావం కలిగించడం కోసమే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనుమానాస్పద ప్రాంతాల్లో నార్కటిక్స్ డాగ్స్ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. గంజాయి డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలని కాలనీవాసులకు సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళల రక్షణ చట్టాలు, నూతన చట్టాల గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు.

అత్యాధునిక టెక్నాలజీతో క్షణాల్లో నేరస్థుల వివరాలు

అత్యాధునిక టెక్నాలజీ టీఎస్‌కాప్ ఆధునాతన యాప్ ద్వారా ఫేషియల్ రికగ్నేషన్ సిస్టం ద్వారా అనుమానితుల ఫొటో తీసి చెక్ చేయడం ద్వారా ఎవరైనా పాత నేరస్థులు నేరం చేసి ఉంటే వెంటనే వారి ఫొటో, వారి బయోడేటా, వారు చేసిన నేరం వివరాలు క్షణాల్లోనే తెలిసిపోతాయని ఏసీపీ మధు వివరించారు. పాత నేరస్థుల ఫొటోలు తీసి ఫింగర్ ప్రింట్ ద్వారా చెక్ చేస్తారని తెలిపారు. నేను సైతం అనే కార్యక్రమం ద్వారా గ్రామాల్లోని ప్రజలు, గ్రామ పెద్దలు, నాయకులు సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలని, పోలీసులకు సహకరించాలని సూచించారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఒకరికి 5 రోజుల జైలు

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పట్టణంలో ఇటీవల వన్ టౌన్ సీఐ వాసుదేవరావు ఆధ్వర్యంలో పోలీసులు నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో ఓ వ్యక్తి మద్యం తాగి డ్రైవింగ్ చేస్తూ పట్టుబడ్డాడు. నిందితుడిని మంగళవారం సిద్దిపేట సెకండ్ క్లాస్ జ్యూడిషయల్ మెజిస్ట్రేట్ కాంతారావు ముందు హాజరు పరచగా విచారణ అనంతరం 5 రోజులు జైలు శిక్షతోపాటు రూ.15,00 జరిమానా విధించారు.

తాటిచెట్ల నరికివేతపై విచారణ.. వ్యక్తిపై కేసు



రాంసాగర్‌లో నరికివేసిన తాటిచెట్ల పరిశీలిస్తున్న ఎక్సైజ్ ఎస్ఐ సురేశ్

చేర్యాల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మండలం రాంసాగర్ గ్రామంలో తాటిచెట్లు నరికివేతపై ఎక్సైజ్, రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. రాంసాగర్ గ్రామానికి చెందిన కొయ్యడ ఇస్తారి తన వ్యవసాయబావి వద్ద పెంచుకుంటున్న తాటిచెట్లను దాసరి రాజయ్య అనే వ్యక్తి ఇటీవల నరికివేసినట్టు ఫిర్యాదు చేశాడు. దీంతో సోమవారం ఇన్‌చార్జి తహసీల్దారు వేణుగోపాలరావు, ఎక్సైజ్ ఎస్ఐ సురేశ్, ఆర్ఐ శ్రీనివాస్ స్థలపరిశీలన చేశారు. చెట్లను నరికివేసిన దాసరి రాజయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్ఐ సురేశ్ తెలిపారు. బాధితుడికి గౌడ సంఘం నాయకులు పచ్చిమడ్ల స్వామి, మేరుగు కృష్ణ, ముత్యం నర్సింహులు, బుడిగె గురువయ్య, రమేశ్ తదితరులు మద్దతుగా నిలిచారు.

వందశాతం పన్నులు వసూలు చేయాలి

● సిద్దిపేట అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

చేర్యాల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మునిసిపల్ పరిధిలో వందశాతం పన్నులు వసూలు చేయాలని సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ అన్నారు. ప్రత్యేకాధికారి హోదాలో మంగళవారం చేర్యాల మునిసిపల్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మునిసిపల్ కమిషనర్ నాగేందర్, సిబ్బందితో సమావేశమయ్యారు. నీటిసరఫరా, రెవెన్యూ, ఆదాయ వనరులు, సిబ్బంది విధుల నిర్వహణ ఇతరత్రా అంశాలపై చర్చించారు. ఇల్లు, నల్లా పన్నుల వసూలు, ట్రేడ్ లైసెన్సుల జారీ తదితర విషయాలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ మేనేజర్ ప్రభాకర్, సీనియర్ అసిస్టెంట్ కృష్ణ, వార్డు ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి

● పలు మండలాల్లో మండలస్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్



మర్కుక్ మండలంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో అతిథులు

జగదేవ్‌పూర్/గజ్వేల్/కొండపాక/తొగుట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ సైన్స్ దినోత్సవ సంబరాల్లో భాగంగా పలు మండలాల్లో విద్యార్థులకు మంగళవారం మండలస్థాయి టాలెంట్ టెస్టులు నిర్వహించారు. ఈ టెస్ట్‌లో మండలస్థాయిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులు ఈ నెల 8న సిద్దిపేటలోని టీటీసీ భవన్‌లో నిర్వహించే జిల్లాస్థాయి టాలెంట్ టెస్ట్‌లో పాల్గొంటారు. జగదేవ్‌పూర్ మండల కేంద్రంలోని గర్ల్స్ హైస్కూల్‌లో ఫోరమ్ ఫర్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఆధ్వర్యంలో మండల స్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్టు నిర్వహించారు. ఈ టాలెంట్ టెస్టులో విద్యార్థులు కే. కీర్తన, సీహెచ్ ప్రదీప్, ఎం.ప్రియాంక వరుసగా మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. గర్ల్స్ హైస్కూల్ హెచ్ఎం శ్రీనివాసస్వామి మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ ఆలోచన విధానాన్ని పెంపొందించుకోవాలని, ప్రశ్నించడం అలవాటు చేసుకోవాలన్నారు. పదోతరగతి భౌతికశాస్త్రంపై పట్టు సాధించడానికి ఈ టాలెంట్ టెస్ట్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మర్కుక్ మండల స్థాయి ఫిజికల్ సైన్స్ టెస్ట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాములపర్తి వేదికగా మండల రిసోర్స్ పర్సన్ చిన్నబ్రహ్మయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మండల స్థాయి ఫిజికల్ సైన్స్ టెస్ట్‌లో ప్రథమ స్థానం నాగచైతన్యరెడ్డి, ద్వితీయ స్థానం వెంకటేష్, తృతీయ స్థానం వీ. రేవతి సాధించారని మండల విద్యాధికారి వెంకట్‌రాములు తెలిపారు. కొండపాక బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థులు సాత్విక, హర్షిత, భారతి వరుసగా మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. ప్రతిభకనబరిచిన విద్యార్థులకు ఎంఈవో శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులతో కలిసి బహుమతులను అందజేశారు.తొగుట మండలం గుడికందుల పాఠశాలలో నిర్వహించిన ఫిజికల్ టాలెంట్ టెస్ట్‌లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులు పవన్‌కుమార్, అక్షయ్‌కుమార్, శీర్షికలకు ఎంఈవో నర్సయ్య మెమొంటోలను ప్రదానం చేశారు.

'యువత సన్మార్గంలో నడవాలి'

గజ్వేల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): యువత సన్మార్గంలో నడవాలని గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానామస్) ప్రిన్సిపాల్ డాక్టర్ నిఖత్ అంజుమ్ సూచించారు. కళాశాలలో మంగళవారం కళాశాల యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ విభాగం ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. మాట్లాడుతూ విద్యార్థులు తమ నూతన ఆలోచనలను సమాజానికి ఉపయోగపడే విధంగా మరియు పారిశ్రామికవేత్తలుగా రూపుదిద్దుకునే అవకాశం కల్పించబడుతుందని తెలిపారు. యువతను సన్మార్గంలో ప్రోత్సహించే విధంగా. వారి భవిష్యత్తుకు, ఉపాధికి ఉపయోగపడే విధంగా ఈ కార్యక్రమం రూపొందించినట్లు తెలిపారు. కార్యక్రమం కోఆర్డినేటర్ లక్ష్మీ నరసయ్య, కళాశాల ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ డి.వెంకటేష్, మెంటార్స్ కెప్టెన్ డా. భవాని, డా.కవిత, మార్కండేయ, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

8 నుంచి కేసీఆర్ మండలస్థాయి క్రికెట్ టోర్నీ

సిద్దిపేట రూరల్,ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ సీఎం కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్‌లో కేసీఆర్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఈ నెల 8 నుంచి నిర్వహించనున్నట్లు సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం సిద్దిపేటలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సిద్దిపేట రూరల్ మండలం బీఆర్ఎస్ నాయకులతో కలిసి క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్ అవిష్కరించారు. అనంతరం కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఆసక్తి గల క్రీడకారులు ఈ నెల 6వ తేదీ సాయంత్రం 4 గంటల లోపు సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. టోర్నమెంట్‌లో విజేతలకు మొదటి బహుమతి రూ.1 లక్ష, రెండో బహుమతి రూ.50 వేలు అందజేయనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు క్యాంపు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ముగిసిన ఇందూర్ ప్రీమియం లీగ్



విజేత జట్టుకు బహుమతి అందజేస్తున్న ఇందూర్ కాలేజ్ చైర్మన్

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఇందూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ఆధ్వర్యంలో మూడు రోజులుగా కొనసాగుతున్న ఇందూరు ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ఇంటర్ లెవెల్ క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం ముగిసినట్టు కళాశాల చైర్మన్ ప్రదీప్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ వీపీ రాజు తెలిపారు. సిద్దిపేట్ ఇంటర్మీడియట్ విద్యార్థులు మరియు ఇందూర్ కళాశాల విద్యార్థులు మొత్తము 10 టీమ్‌లుగా ఏర్పడి పోటీపడ్డారు. ప్రభుత్వ జూనియర్ కాలేజ్ సిద్దిపేట, గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ మిరుదొడ్డి మధ్యలో జరిగిన రసవత్తర ఫైనల్ పోరులో సిద్దిపేట జూనియర్ కళాశాల విద్యార్థులు గెలుపొందగా, వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బెనర్జీ, పి ఆర్ ఓ బొడ్డు రఘు , ఫిజికల్ డైరెక్టర్ సంతోష్, ఎండి సల్మాన్, పోచయ్య, మహేష్, హెచ్‌వోడీస్ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి



హుస్నాబాద్: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్

హుస్నాబాద్/చేర్యాల, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళవారం హుస్నాబాద్ పట్టణంలో జరిగిన మండలస్థాయి బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నిత్యం ప్రజల్లోనే ఉంటూ, పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒకరికి సర్పంచ్‌గా అవకాశం వస్తే మరొకరికి ఎంపీటీసీకి పోటీ చేసే అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. సమావేశంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజారెడ్డి, మాజీ జడ్పీటీసీ మంగ, బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధులు సుద్దాల చంద్రయ్య, అయిలేని మల్లికార్జున్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎండీ అన్వర్, మండల అధ్యక్షుడు మధుకర్‌రెడ్డి, నాయకులు తదితరులున్నారు. చేర్యాల మండలం దొమ్మాట, వేచరేణి, గుర్జకుంట గ్రామాల్లో మంగళవారం బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశాలను నిర్వహించారు. సమావేశాల్లో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు అంకుగారి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు నిమ్మ రాజీవ్‌రెడ్డి, పచ్చిమడ్ల సిద్దిరాములు, తాడెం రంజిత, పర్పాటకం దుర్గారెడ్డి, ఏనుగుల దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి మొండి చేయి

● యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పవన్‌కుమార్

నంగునూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి మొండి చేయి చూపించిందని యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాదుల పవన్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం నంగునూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి తగిన ప్రాధాన్యం ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. కేంద్రం విద్యా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని ఆరోపించారు. సమావేశంలో బడే.అశోక్, నవీన్, బొజ్జ గోపి, శ్రీధర్, రాజు, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మారం గ్రామవాసికి డాక్టరేట్

సిద్దిపేట, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మిరుదొడ్డి మండలం ధర్మారం గ్రామానికి చెందిన వర్ధ వేణు మంగళవారం ఉస్మానియా విశ్వవిద్యాలయ డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2000-2020 తెలుగు కవిత్వం పర్యావరణ స్పృహ అనే అంశంపై పీహెచ్‌డీ పూర్తి చేసినట్టు తెలిపారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ నిత్యానందరావు, ప్రొఫెసర్లు కమలాకర్‌శర్మ, రఘు, కాశీం, డాక్టర్ విజయలక్ష్మి చేతులమీదుగా అందుకున్నారు.

దుబ్బాక డిగ్రీ అధ్యాపకురాలికి..

సిద్దిపేట, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): దుబ్బాక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకురాలు స్వాతి మంగళవారం డాక్టరేట్ పట్టాను పొందారు. రాజస్థాన్ రాష్ట్రంలోని జుంజును ప్రాంతంలోని శ్రీజగదీష్ ప్రసాద్ జబర్మల్ టిబ్రేవాలా యూనివర్సిటీ బయోడైవర్సిటీ ఆఫ్ సాక్రెడ్ గ్రూప్స్‌అండ్ ఇట్స్ సిగ్నిఫికేషన్స్ ఉమ్మడి మెదక్‌జిల్లాలోని ప్రకృతి వనాల జీవవైవిధ్యం, దాని ప్రాముఖ్యత అనే అంశంపై డాక్టరేట్ పట్టాను పొందారు. డాక్టరేట్ పట్టాను పొందిన స్వాతిని కళాశాల ప్రిన్సిపాల్ భవాని, అధ్యాపక బృందం శాలువతో సన్మానించారు.

జాతీయస్థాయి ఈత పోటీలకు బండి నర్సింలు ఎంపిక

సిద్దిపేట కల్చరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): గుజరాత్ రాష్ట్రంలో మార్చి 3వ తేదీ నుంచి జరిగే జాతీయ స్థాయి ఈత పోటీలకు సిద్దిపేట జిల్లా నుంచి బండి నర్సింలు ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని డైరెక్టర్ ఆఫ్ స్కూలు ఎడ్యుకేషన్ కమిషనర్ ఈవీ నరసింహరెడ్డిని నర్సింలు మర్యాదపూర్వకంగా కలిశారు. జాతీయస్థాయి క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.

కేబీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డప్పుల పంపిణీ

ములుగు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కేబీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మర్కుక్ మండలం ఎర్రవల్లి గ్రామస్థులకు మంగళవారం చైర్మన్ కొన్యాల బాల్‌రెడ్డి 60 డప్పులు పంపిణీ చేశారు.

అనంతసాగర్‌లో ముగిసిన వార్షిక బ్రహ్మోత్సవాలు

చిన్నకోడూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): వసంత పంచమిని పురస్కరించుకొని మండలంలోని అనంతసాగర్ గ్రామ శివారులోని శ్రీసరస్వతీ క్షేత్రంలో 3 రోజుల పాటు నిర్వహించిన 35వ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయంలో పూర్ణాహుతి, కుంకుమార్చన, అక్షరస్వీకారాలు నిర్వహించారు.

● గజ్వేల్ రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెజుగామలో రథసప్తమిని పురస్కరించుకొని శ్రీపార్థివేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం రుద్రహోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనం, మహా అభిషేకం, రుద్రహోమం నిర్వహించారు.

చెత్త ఇవ్వనివారి వివరాలు సేకరించండి



మున్సిపల్ సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ ఆశ్రిత్‌కుమార్

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఇంటి నుంచి తప్పనిసరిగా తడి, పొడి చెత్తను సేకరించాలని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ సిబ్బందిని ఆదేశించారు. అదేవిధంగా మున్సిపల్ వాహనానికి చెత్త ఇవ్వని వారి వివరాలను సేకరించి వారు చెత్తను ఎక్కడ వేస్తున్నారో గమనించాలని తెలిపారు. మంగళవారం సిద్దిపేట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఉదయాన్నే చెత్త సేకరణకు వెళ్తున్న పారిశుధ్య కార్మికుల హాజరును పరిశీలించి రిజిష్టర్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ వాహనానికి కాకుండా చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేసేవారికి జరిమానా విధించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. పట్టణంలో ఎక్కడ శుభకార్యాలు జరిగిన ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లు వాడకుండా చర్యలు తీసుకోవాలని, ప్రతీ వార్డులో ఏర్పాటు చేసిన స్టీల్ బ్యాంకులను సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ఫంక్షన్‌హాల్ యజమానులు, నిర్వాహకులు, పట్టణ ప్రజలు ప్లాస్టిక్ గ్లాసులు, పేపర్ ప్లేట్లను వినియోగించినట్లయితే జరిమానా విధించాలని సూచించారు. నూతనంగా నియమితులైన వార్డు అధికారులు సైతం ఉదయాన్నే వార్డులలో పర్యటిస్తూ పారిశుధ్య పనులను పరిశీలించాలని ఆదేశించారు. పట్టణ ప్రజలు ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ రహిత వస్తువులను వినియోగిస్తూ ఆదర్శంగా నిలుస్తూ ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దాలన్నారు.

ఆర్థిక రంగాన్ని పెంపొందించే బడ్జెట్



గజ్వేల్‌లోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

గజ్వేల్/చేర్యాల, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): దేశ ఆర్థిక రంగాన్ని పెంపొందించేలా కేంద్ర బడ్జెట్ ఉందని బీజేపీ సీనియర్ నాయకులు మాదాడి జశ్వంత్‌రెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీజేపీ పట్టణ, మండలాధ్యక్షుడు మనోహర్‌యాదవ్, అశోక్‌గౌడ్ ఆధ్వర్యంలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా జశ్వంత్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌పై చర్చకు కేంద్ర మంత్రులు, ఎంపీ అవసరం లేదని, పార్టీ కార్యకర్తలుగా బడ్జెట్‌లో ప్రతీ అంశంపై తాము క్లారిటీ ఇస్తామని, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నర్సారెడ్డి ఇందుకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. గజ్వేల్‌లో ప్రజాధనంతో నిర్మించిన ఎన్నో అభివృద్ధి పనులు ఆగిపోయాయని, వాటి గురించి ఎప్పుడైనా ఏ మంత్రి దగ్గరికైనా వెళ్లారా అని పార్టీ జిల్లా అధ్యక్షుడు నర్సారెడ్డిని బీజేపీ నాయకులు ప్రశ్నించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు యెల్లు రాంరెడ్డి, కుడిక్యాల రాములు, రామచందర్ రెడ్డి, చేప్యాల వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. కేంద్ర బడ్జెట్‌పట్ల హర్షం వ్యక్తం చేస్తూ కొమురవెల్లి మండల కేంద్రంలో బీజేపీ నాయకులు ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకుడు కొయ్యడ నవీన్, నాయకులు శ్రీనివాస్, ఎక్కలదేవి మధు, పుట్ట కనకయ్య, జనగాం తిరుపతి, ఈగ కనకయ్య, భానుచందర్, బాబు పాల్గొన్నారు.

కాంగ్రెస్ చేతిలో బందీ అయిన తెలంగాణ



గుర్రాలగొందిలో బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తున్న మాజీ చైర్మన్ రాజనర్సు

సిద్దిపేట రూరల్/చిన్నకోడూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): పోరాడి సాధించుకున్న తెలంగాణ కాంగ్రెస్ చేతిలో బందీగా మారిందని సిద్దిపేట మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేర్గు రాజనర్సు పేర్కొన్నారు.మంగళవారం నారాయణరావుపేట మండలం గుర్రాలగొంది, మల్యాల గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్క హామీని అమలు చేయకుండా మభ్యపెడుతూ కాలం వెల్లదీస్తుందని మండిపడ్డారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలపార్టీ అధ్యక్షుడు ఎల్లయ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎల్లారెడ్డి, గుడాల నరేష్, వడ్లకొండ సాయి, మాజీ ఎంపీపీ బాలకృష్ణ, నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా చిన్నకోడూరు మండలంలోని అనంతసాగర్, చెర్ల అంకిరెడ్డిపల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ మండల సమన్వయకర్త పాల సాయిరాం, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కాముని శ్రీనివాస్‌తో కలిసి బీఆర్ఎస్ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను గూర్చి అడగబోతే సీఎం రేవంత్‌రెడ్డి అక్రమ అరెస్టులు చేయిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్‌లు కనకరాజు, సదానందం, మాజీ వైస్ ఎంపీపీ పాపయ్య, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



కోదండరాంపల్లి పాఠశాలలో మాట్లాడుతున్న కమిషనర్ నరసయ్య

గజ్వేల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ కమిషనర్ గొల్కొండ నరసయ్య అన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని 3వ వార్డు కోదండరాంపల్లి ప్రాథమిక పాఠశాలకు డెస్కులు, ఆట వస్తువులను ఐడీబీఐ-ప్రజ్ఞాపూర్ శాఖ ఆధ్వర్యంలో సీఎస్ఆర్ నిధుల ద్వారా అందజేశారు. కార్యక్రమానికి మునిసిపల్ కమిషనర్ నరసయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఐడీబీఐ బ్యాంకు మేనేజర్ వినయ్‌కుమార్ మాట్లాడుతూ ఐడీబీఐ సీఎస్ఆర్ ఫండ్ ద్వారా వందలాది పాఠశాలలకు బెంచీలు, మంచినీటి వసతి, ఇతర సదుపాయాలు కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో వై. కృష్ణ, ప్రధానోపాధ్యాయురాలు లలిత, ఉపాధ్యాయులు శ్రీశైలం, ప్రేమలత, ఈశ్వర్, ఐడీబీఐ మెదక్‌శాఖ మేనేజర్ మధుకుమార్, బ్యాంకు సిబ్బంది కరుణాకర్, పరమేశ్వరాచారీ, కమల్, బాబు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను సొంత జిల్లాకు బదిలీ చేయాలి

● టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి

తొగుట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జీవో 317కింద బదిలీ అయిన ఉపాధ్యాయులను స్థానిక జిల్లాలకు బదిలీ చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం టీపీటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో తొగుట మండలంలోని ఎల్లారెడ్డిపేట, ఘనపూర్, గుడికందుల, తొగుట, వెంకట్రావ్‌పేట, పెద్దమాసాన్‌పల్లి పాఠశాలల్లో పర్యటించి ఉపాధ్యాయుల సమస్యల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యల కోసం ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని లేనిపక్షంలో ఐక్య ఉద్యమాల ద్వారా పోరాటాన్ని ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాములు, బాలరాజు. జిల్లా కౌన్సిలర్లు రవికిరణ్, అమరేందర్‌రెడ్డి, వెంకటనర్సింహులు, నాయకులు లక్ష్మారెడ్డి, రాజు, దుర్గారెడ్డి, సత్యకుమార్ పాల్గొన్నారు.

రెడ్డిలను అవమానించడం తగదు

● రెడ్డి జాగృతి సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షురాలు

సిద్దిపేట టౌన్/ములుగు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రెడ్డిలను అవమానించేలా మాట్లాడటం తీన్మార్ మల్లన్నకు తగదని రెడ్డి జాగృతి సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షురాలు బత్తుల మమతారెడ్డి పేర్కొన్నారు. తీన్మార్ మల్లన్న రెడ్డిల పట్ల అనుచిత వాఖ్యలు చేశారని ఆరోపిస్తూ మంగళవారం సిద్దిపేట పట్టణంలోని ముస్తాబాద్ చౌరస్తా వద్ద రెడ్డి జాగృతి సంఘం సభ్యులు ఆయన ఫెక్సీని దహనం చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పట్టిపెల్లి రాజిరెడ్డి, జశ్వంత్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి, రాజలింగారెడ్డి, నరేందర్ రెడ్డి, బాల్‌రెడ్డి, రామచంద్రరెడ్డి, హనుమంతరెడ్డి, సత్యంరెడ్డి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. రెడ్డి సామాజిక వర్గాన్ని బూతులు తిట్టిన తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్‌పై చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని మంగళవారం ములుగు పోలీస్ స్టేషన్‌లో ములుగుమండల రెడ్డి సంఘం అధ్యక్షుడు కె బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రెడ్డి సమాజంపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఉపసంహరించుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

గజ్వేల్ రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు గంజాయి ఇతర మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ సైదా పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని రిమ్మనగూడ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని విద్యార్థులకు మహిళల రక్షణకు ఉన్న చట్టాల గురించి, షీటీమ్ నిర్వహిస్తున్న విధుల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకునే సమయంలో చెడు అలవాట్లకు బానిస కావద్దని, ప్రతి ఒక్కరూ చదువుపై దృష్టి సారించాలని తెలిపారు. చదువుపై దృష్టి పెట్టి 10జీపీఏ సాధించిన విద్యార్థులకు డిపార్ట్‌మెంట్ తరఫున సన్మానించి రివార్డు అంద జేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెడ్మాస్టర్ రాజు, గజ్వేల్ షీటీమ్ బృందం శ్రీరాములు, పోలీస్ సిబ్బంది తదితరులున్నారు.

బాల వికాస సేవలు అభినందనీయం

కోహెడ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): బాల వికాస సంస్థ వ్యవస్థాపకులు బాల, ఆంద్రూస్ సమాజానికి చేస్తున్న సేవలు అభినందనీయమని డాక్టర్ బద్దం తిరుపతిరెడ్డి అన్నారు. మంగళవారం బాల (బాలమ్మ) జన్మదిన సందర్భంగా రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎన్నో గ్రామాలకు బాలమ్మ సేవలు మరిచిపోలేనివన్నారు.

కోహెడలో మందకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం

కోహెడ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు ఇచ్చిన నేపథ్యంలో మంగళవారం మండలం కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా దళిత నాయకులు మాట్లాడుతూ మందకృష్ణ తన జీవితాన్ని సామాజిక ఉద్యమాలకు అంకితం చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు.